పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మధురవాడలో లబ్ధిదారుకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

మధురవాడ: పేద ప్రజల సంక్షేమం కోసం నిత్యం తపించే నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కొనియాడారు. సోమవారం సాయంత్రం జీవీఎంసీ 8వ వార్డు మిథిలాపురి వుడా కాలనీ వికలాంగుల కాలనీ, వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గల ఎన్టీఆర్ హుద్‌హుద్ కాలనీల్లో ఆయన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నివాసాల వద్దకు వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును వివరిస్తూ, సంబంధిత కరపత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు అమలవుతాయని, వలంటీర్, సచివాలయ వ్యవస్థలు కొనసాగుతాయని, ఇంటివద్దకే అన్ని సేవలు అందుతాయన్నారు. వేరే పార్టీ అధికారంలోకి వస్తే ఏ పని జరగాలన్నా నాయకులు, అధికారుల చుట్టూ తిరగాల్సిందేనని చెప్పారు. ప్రజల సమస్యలు నిత్యం తెలుసుకుంటూ పరిష్కారం కోసం తపిస్తున్న నాయకుడు మన సీఎం జగన్ అని కొనియాడారు. ఈ సందర్భంగా హుద్‌హుద్ కాలనీలో 1 నుంచి 10 బ్లాకుల మధ్య అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మించాలని, తాగునీరు సరఫరా చేసే సమయం పెంచాలని, అంగన్‌వాడీ కేంద్రం, పార్కులు ఏర్పాటు చేయాలని, కాలనీకి వచ్చే దారిలో ఆకతాయిల ఆగడాలు అరికట్టాలని, వికలాంగుల కాలనీలో హుద్‌హుద్ కాలనీ నుంచి కిందకి సీసీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, వీధిలైట్లు తదితర సమస్యలు పరిష్కరించాలని పడాల అనంత్, దేవి తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తొలుత హుద్‌హుద్ కాలనీ ప్రజలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, లొగడల రామ్మోహన్, ఉప్పులూరి గోపి, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ముదుండి రాజేశ్వరి, ఎంవీ రమణమూర్తి, జ్యోతిర్మయి, చేకూరి రజని, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, డీఈ శ్రీహరి, ఏఈ శ్రీధర్, ఆర్ఐ మల్లేశ్వరరావు, ఏపీడీ గంగాధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదలకు పండ్ల పంపిణీ

మధురవాడ : జీవీఎంసీ 5వ వార్డు కొమ్మాది జంక్షన్ సమీపంలోని శివశక్తినగర్ రోడ్డులో సోమవారం పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కూన వెంకట రమణ, బగాది జగదీశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ మిథిలాపురి వుడా కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు ఎన్‌జీజీవోస్ కాలనీ, చంద్రంపాలెం, సుద్దగెడ్డ, వాంబేకాలనీ, పోర్టుకాలనీ, శ్రీనివాస్‌నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని రామమూర్తి కోరారు.

ఉపాధి హామీ పథకం ప్రజావేదిక నేడు

ఆనందపురం : మండలంలో 2022 – 2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులపై మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నారని ఎంపీడీవో అడపా లవరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తనిఖీలో బయటపడిన అంశాలను వేదికలో వివరిస్తారని, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

పీఎం పాలెం : జాతీయ రహదారి నుంచి రుషికొండ బీచ్ రోడ్డుకు వెళ్లే మార్గంలో పనోరమ హిల్స్ డౌన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 5వ వార్డు పరిధి మారికవలస రాజీవ్ గృహకల్పలో నివసిస్తున్న రఘు, శ్రీను, సంజూ స్నేహితులు. జాతీయ రహదారి నుంచి రుషికొండ బీచ్‌కు వెళ్లే రోడ్డుపై ఆదివారం రాత్రి 9:30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ముగ్గురూ బయలుదేరారు. పనోరమా హిల్స్ డౌన్‌లోకి వచ్చేసరికి డివైడర్‌ను బైక్ ఢీకొనడంతో వాహనం నడుపుతున్న రఘు తలకు బలమైన గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న క్షతగాత్రుడిని 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. మిగిలిన ఇద్దరూ సురక్షితంగా ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

స్కూల్ వలంటీర్లకు రూ.12 లక్షల వేతనాలు



దివీస్ అందించిన చెక్కులతో వలంటీర్లు, సీఎస్ఆర్ ప్రతినిధి నాగరాజు

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం వివిధ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 18 మంది వలంటీర్లకు సోమవారం గౌరవ వేతనాలు అందించింది. ఇందులో భాగంగా 10 నెలలకు సంబంధించి వీరికి రూ.12 లక్షలు పంపిణీ చేసింది. దివీస్ పరిపాలన విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు పెంపొందించే కార్యక్రమంలో భాగంగా అవసరమైన పాఠశాలల్లో వలంటీర్లను నియమించి చిత్తశుద్ధితో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ సీఎస్ఆర్ అధికారి ఇ.ఎస్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బోటు షికారు నిలిపివేత

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో బోటు షికారును ప్రస్తుతం నిలిపివేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సముద్రంలో అలల ఉధృతి తీవ్రస్థాయిలో ఉండటం, బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం దృష్ట్యా బోటు షికారు నిలిపివేస్తున్నామని, వాతావరణం అనుకూలించిన తరువాత కొనసాగిస్తామని పేర్కొన్నారు.

క్లాప్ వాహనాల సిబ్బందికే చెత్త అందించండి

సాక్షి ఎఫెక్ట్..



బాలికల వసతి గృహం వార్డెన్ రమాదేవితో మాట్లాడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్

తగరపువలస: ఇళ్లు, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు ఎవ్వరైనా విధిగా చెత్తను క్లాప్ వాహనాలతో వచ్చే శానిటేషన్ సిబ్బందికే అందించాలని, రోడ్లపై పడేయవద్దని జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ కోరారు. 'క్లాప్ వాహనం రాకపోవడంతో వసతి గృహ బాలికలకు ఇక్కట్లు' శీర్షికతో సాక్షిలో ఆదివారం ప్రచురించిన వార్తకు ఆయన స్పందించారు. సోమవారం ఆయన వసతిగృహం వద్దకు వెళ్లి వార్డెన్ రమాదేవితో మాట్లాడారు. రోజూ వసతిగృహం వద్దకు క్లాప్ వాహనం పంపిస్తామని చెప్పారు. దీనిపై వార్డెన్ మాట్లాడుతూ కొత్త విద్యార్థినులు తెలియక చెత్తను బయటకు తీసుకెళ్లారని, ఇకపై అలా జరగకుండా క్లాప్ వాహనంతో వచ్చే సిబ్బందికే అందిస్తామని తెలిపారు.

నాట్యరవళి విద్యార్థినుల ప్రతిభ



బంజార జానపద నృత్యానికి మొదటి బహుమతి అందుకుంటున్న నాట్యరవళి విద్యార్థినులు

తగరపువలస: తిరుమల తిరుపతి దేవస్థాన వేదిక మహతి ఆడిటోరియంలో గత నెల 23 నుంచి 30 వరకు జాతీయ స్థాయిలో నిర్వహించిన శాస్త్రీయ, జానపద నృత్యాల పోటీల్లో తగరపువలసకు చెందిన నాట్యరవళి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన ఇచ్చారు. ఇందులో భాగంగా 30న జరిగిన బంజార జానపద నృత్యానికి ప్రథమ బహుమతి కింద రూ.10వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం, మెమెంటో అందుకున్నారు. అలాగే క్లాసికల్ నృత్య ప్రదర్శనలో వీరికి ప్రోత్సాహక బహుమతి లభించింది.

సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో జరిగిన ఈ పోటీలకు 8 రాష్ట్రాల నుంచి 284 నృత్య బృందాలకు చెందిన 1200 మంది కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో బహుమతులు గెలిచిన విద్యార్థినులు తీక్షణ, తనూజ, లాస్య, జాహ్నవి, ఝాన్సీ, స్వాన్విక్, వేదామృత, ప్రశాంత్, శృతి, గీతిక, జ్యోతిర్మయి, ఇషాలను అకాడమీ వ్యవస్థాపకుడు ఉమ్మిడి మహేష్‌బాబు, గౌరవ అధ్యక్షుడు పి.రాజేంద్రప్రసాద్, కనక మహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల తాతాజీ, అప్‌లింక్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్.ఎల్.ఎమ్ ప్రసాద్ తతదితరులు అభినందించారు.

చెర్రీ పండ్లతో కొత్తమ్మతల్లికి అలంకరణ



చెర్రీ పండ్లతో అలంకరించిన కొత్తమ్మతల్లి విగ్రహం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట, కొత్తపేట తదితర గ్రామాల దేవత కొత్తమ్మతల్లిని సోమవారం సాయంత్రం చెర్రీ (వాక్కాయి), గులాబీ, చామంతులతో అలంకరించారు. ఇందుకు 50 కిలోల చెర్రీలు, గులాబీ, చామంతులతో చేసిన 12 అడుగుల గజమాల, 12 అడుగుల బంతిపూల మాల, 10 మూరల తులసి మాలలతో అలంకరించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన అలంకరణకు రజక సంతపేటకు చెందిన నీలాపు ఈశ్వరరావు, రమణమ్మ, అభినయ్‌రెడ్డి సహాయ సహకారాలు అందించారు. భీమిలి మండలం చిప్పాడకు చెందిన భవానీ పీఠం, సుత్తమ్మ తల్లి ఆలయానికి చెందిన సాడి కుమార్, వెంపాడ రామిరెడ్డి, చిట్టిబాబు, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు అలంకరించారు. ఈ అపురూపమైన అలంకరణతో మంగళవారం అమ్మవారి దర్శనాలు భక్తులకు కల్పించనున్నారు.

మూడో విడత శిక్షణకు 295 మంది ప్రధానోపాధ్యాయులు



మాట్లాడుతున్న విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకురాలు జ్యోతికుమారి

తగరపువలస: ప్రధానోపాధ్యాయుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యక్రమంలో భాగంగా భీమిలి ఏఎంజీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఫర్ వుమెన్ క్యాంపస్‌లో మూడో విడత శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఇప్పటికే ఈ కేంద్రంలో రెండు విడతల శిక్షణ పూర్తికాగా మూడో విడత శిక్షణకు ఆరు జిల్లాల నుంచి 295 మంది ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. శిక్షణ ఈ నెల 5 వరకు జరుగుతుందని విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకురాలు ఎం.జ్యోతికుమారి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష జిల్లా అదనపు సమన్వయకర్త బి.శ్రీనివాసరావు, రాష్ట్ర పరిశీలకుడు పి.వెంకటరమణ, ప్రోగ్రాం మేనేజర్ రింకూ గౌడ్, సత్య కైవల్య, డిప్యూటీ డీఈవో ఎ.గౌరీశంకర్, చినగదిలి, పెందుర్తి ఎంఈవోలు సీహెచ్ రవీంద్రబాబు, టి.మధుమూర్తి, అకడమిక్ మోనిటరింగ్ అధికారి జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎంసీఏ సౌత్ ఈస్ట్ రీజియన్ చైర్మన్‌గా రొనాల్డ్



రొనాల్డ్ విలియమ్స్

బీచ్ రోడ్డు: వైఎంసీఏ నేషనల్ కౌన్సిల్‌లో విశాఖ వైఎంసీఏకు చెందిన నలుగురికి చోటు లభించింది. వైఎంసీఏ సౌత్‌ఈస్ట్ రీజియన్ చైర్మన్‌గా మరోసారి రొనాల్డ్ విలియమ్స్ ఎంపికయ్యారు. సోమవారం జరిగిన వైఎంసీఏ నేషనల్ కౌన్సిల్ సమావేశంలో రొనాల్డ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేషనల్ కౌన్సిల్ వైస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ బెట్సీ విలియమ్స్, ఈసీ సభ్యులుగా డాక్టర్ కృపానందకుమార్, విజయ్‌ప్రదాన్ ఎన్నికయ్యారు.

కాలువపై పలకలు విరిగిపోవడంతో ప్రమాదాలు



నేల్తేరుకు వెళ్లే మార్గంలో విరిగిపోయిన కాలువపై పలకలు

ఆనందపురం : జాతీయ రహదారి నుంచి సమీప గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అనుసంధాన రోడ్లు అస్తవ్యస్తంగా తయారవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆనందపురం – పెందుర్తి జాతీయ రహదారి నుంచి నేల్తేరు గ్రామానికి రోడ్డు ఉంది. ఆరు లైన్ల రహదారి నిర్మాణంలో రోడ్డు పక్కన కాలువ ఏర్పాటు చేసి దాని పైనుంచి నేల్తేరు రోడ్డుకి అనుసంధానించారు. కాగా అక్కడ కల్వర్టు నిర్మించాల్సి ఉండగా కాలువపై తేలికపాటి పలకలు వేశారు. అయితే సమీపంలో పరిశ్రమలు ఉండడంతో ఈ మార్గంలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఒత్తిడికి పలకలు విరిగిపోతున్నాయి. ఇలా పలుమార్లు కొత్తగా పలకలు వేస్తున్నా వెంటనే విరిగిపోతున్నాయి. దీంతో చేసేది లేక రోడ్లు నిర్వహించే సిబ్బంది గోతుల్లో మట్టివేసి అక్కడ హెచ్చరిక స్టాపర్లు పెట్టి చేతులు దులిపేసుకున్నారు. గత కొన్ని నెలలుగా ఇక్కడ పరిస్థితి ఇలాగే ఉందని, ముఖ్యంగా రాత్రి వేళ ప్రమాదాలకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్కడ కల్వర్టు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

హిందీ హయ్యర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ (చెన్నై) సెప్టెంబరులో నిర్వహించే హయ్యర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఈ నెల 5 వరకు గడువు పెంచారు. ఆంధ్ర, తెలంగాణలో వర్షాల కారణంగా రూ.10 అపరాధ రుసుముతో ఈ గడువు పెంచినట్లు నిర్వాహకులు ప్రకటించారు. మిగిలిన వివరాలకు 89858 97419లో సంప్రదించాలని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్ కృష్ణారావు కోరారు.

బైక్‌పై వెళ్తూ మూర్ఛతో వ్యక్తి మృతి



ఎల్లంకి శ్రీనివాస్ మృతదేహం

అక్కిరెడ్డిపాలెం : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి మూర్ఛ వ్యాధికి గురై మృతి చెందిన ఘటన ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద సోమవారం జరిగింది. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెం ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన ఎల్లంకి శ్రీనివాస్(44) ఓ లిఫ్ట్ కంపెనీలో మార్కెటింగ్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం శ్రీనివాస్ గాజువాక నుంచి ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్దకు వచ్చేసరికి మూర్ఛ రావడంతో హఠాత్తుగా తన వాహనాన్ని నిలిపి పక్కకు ఒరిగిపోయాడు. కొద్దిసేపటికే మృతి చెందాడు. పలువురు ఆయనకు సపర్యలు చేసినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపారు. మృతుని వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, పాప, బాబు ఉన్నారు.

శ్రీవారికి వెండి కుందుల బహూకరణ



వెండి కుందులను తీసుకొస్తున్న మావూరి వెంకటరమణ

కొమ్మాది : రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి సోమవారం సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ రూ.7 లక్షలు విలువ చేసే వెండి కుందులను బహూకరించారు. మంగళవాయిద్యాల నడుమ వెండి కుందులను తీసుకొచ్చి అంతరాలయంలో శ్రీవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో జగన్మోహనాచార్యులు, టీటీడీ వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

నీళ్ల కుండీలు – పద్మనాభం రోడ్డుకు మహర్దశ

రూ.6 కోట్ల నాన్‌ప్లానింగ్ నిధులు మంజూరు



గతుకులమయమై అధ్వానంగా ఉన్న నీళ్ల కుండీలు – పద్మనాభం రోడ్డు

ఆనందపురం : మండలంలోని నీళ్ల కుండీలు నుంచి పద్మనాభం వరకు గల రాష్ట్ర హైవే రోడ్డు పునర్నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రోడ్డు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నాన్ ప్లానింగ్ నిధులు కింద రూ.6 కోట్లు మంజూరు చేయడంతో ఈ రహదారికి మహర్దశ పట్టనుంది. నీళ్ల కుండీలు నుంచి పద్మనాభం వరకు గల ఈ మార్గంలో గిడిజాల, ముచ్చర్ల, చిన్నయ్యపాలెం, బోని జంక్షన్ల వద్ద రోడ్డు లోతట్టుగా ఉంటుంది. దీంతో కొండల నుంచి వచ్చే వరద నీరు నేరుగా రోడ్డు పైనే ప్రవహించడంతో చాలా చోట్ల కొట్టుకుపోయి గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయమై రోడ్లు భవనాల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ పల్లంగా ఉన్న చోట రోడ్డుని ఎత్తు చేయడంతోపాటు పూర్తి స్థాయిలో తారు లేయరు వేసి పునర్నిర్మిస్తామని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఘనంగా పట్టభద్రుల దినోత్సవం



వైద్య విద్యార్థినికి డిగ్రీ పట్టా అందిస్తున్న ప్రొఫెసర్ సంజయ్ జోడ్‌పే, భరత్

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) వైద్య కళాశాల 2017 – 18 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల పట్టభద్రుల దినోత్సవాన్ని సోమవారం వైద్య కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. వైద్య విద్యార్థులకు పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సంజయ్ జోడ్‌పే డిగ్రీ పట్టాలు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల ఆరోగ్య స్థితిగతులలో వ్యత్యాసాలున్నాయన్నారు. ప్రజారోగ్యాన్ని వాతావరణ మార్పులు, కాలుష్య తీవ్రతతోపాటు ప్రభుత్వ పన్నుల విధానం సైతం ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. చైనాలో వైద్య, ఆరోగ్య రంగంలో పది మిలియన్ల మంది పని చేస్తుండగా భారతదేశంలో అది 5 మిలియన్లకు పరిమితమైందన్నారు. యువ వైద్యులు నిరంతర పరిశోధకులుగా, సమాజ పరిస్థితులను అర్థం చేసుకుంటూ ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్, గీతం మెడికల్ సైన్సెస్ ప్రో వీసీ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్.పి.రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఇద్దరు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కమల్‌కుమార్, వెంకటేష్‌తో శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్ద నున్న జీజీ పవర్ జిమ్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం విశాఖలో జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా చాంపియన్‌షిప్, జిల్లా ఎంపికలు జరిగాయి. ఇందులో ఎ.కమల్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలవగా కె.వెంకటేష్ తృతీయ స్థానంలో నిలిచాడు. వీరిద్దరూ వచ్చే సెప్టెంబర్ నెలలో కర్నూలులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు సోమవారం జిమ్‌లో జాతీయ యోగా రిఫరీ, కోచ్ నల్లా శ్రీనివాసరావు వీరిద్దరినీ అభినందించారు. త్వరలో జరగనున్న పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి గెలుపొందాలని కోరారు.

పార్కు స్థలంలో అక్రమ నిర్మాణాలు అడ్డుకోండి

జోన్ – 2 స్పందనకు 14 అర్జీలు



జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డు బింద్రానగర్ లేఅవుట్ పార్కు స్థలంలో అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలని హిందుస్థాన్ షిప్‌యార్డు హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి శేషగిరిరావు, తదితరులు జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మికి ఫిర్యాదు చేశారు. దీంతో తక్షణమే ఆ పనులు నిలుపుదల చేయించాలని ప్లానింగ్ సెక్రటరీని జెడ్సీ ఆదేశించారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రేవళ్లపాలెం సత్యసదన్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు శ్రీదేవి తదితరులు గెడ్డ మీద కల్వర్టు, బక్కన్నపాలెం రోడ్డు వరకు ఉన్న మట్టి రోడ్డు వర్షానికి కోతకు గురైందని, దాని నిర్మాణం కోసం వినతిపత్రం ఇచ్చారు. మొత్తంగా 14 అర్జీలు వచ్చాయని, సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపడతామని జెడ్సీ చెప్పారు.

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయంలో జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 11 వినతులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఆరు, పట్టణ ప్రణాళిక విభాగానికి రెండు, రెవెన్యూ విభాగానికి రెండు, యూసీడీ విభాగానికి ఒక వినతి వచ్చింది. ఈ మేరకు వచ్చిన వినతులను పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని జెడ్సీ వెల్లడించారు.

17 నుంచి శ్రావణ మాసం పూజలు



డాబాగార్డెన్స్: ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు శ్రావణ మాసం పూజలు జరగనున్నాయి. కనమహాలక్ష్మి దేవస్థానంలో నెల రోజులూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్రవారాల్లో 2 విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే భక్తులు(దంపతులు) రూ.400 రుసుం చెల్లించాలి. పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చుతుంది. పూజ అనంతరం భక్తులకు శేషవస్త్రాలు, మహాప్రసాదం అందజేస్తారు. పూజా రుసుంను అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచిలో చెల్లించాలని ఆలయ ఈవో శిరీష, ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తెలిపారు. పూర్తి వివరాలకు 0891–2568645, 2566515, 2731250 నంబర్లలో సంప్రదించాలన్నారు.